సాక్షి
నిర్మల్
సోమవారం ∣ 17 ∣ ఫిబ్రవరి ∣ 2025



ఆదర్శప్రాయుడు సేవాలాల్

సంత్ సేవాలాల్ మహరాజ్ ఆదర్శ ప్రాయుడని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. బాసరలోని గోదావరి నది ఒడ్డున సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. 8లో▸



ముగిసిన మైసమ్మ జాతర

మందమర్రి మండలం బొక్కలగుట్ట గాంధారీ ఖిల్లా వద్ద నిర్వహిస్తున్న మైసమ్మ జాతర ముగిసింది. ఆదివాసీ నాయక్‌పోడ్‌లు అధికసంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0 / 19.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. చలి కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్

గజ్జలమ్మ దేవికి పూజలు



దాతను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీగజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్ల ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, ధర్మాబాద్, బోకర్, ఇస్లాంపూర్ ప్రాంతాల నుంచి కూడా భక్తులు వచ్చారు. చిన్నారులతో బంగారం తులాభారం వేయించారు. తలనీలాలు సమర్పించారు. బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. మండలంలోని ఓలా గ్రామానికి చెందిన సింగిల్ విండో మాజీ డైరెక్టర్ కర్ల బక్కయ్య–అర్చన దంపతులు అమ్మవార్లకు మూడున్నర మాసాల బంగారపు ముక్కుపుడక, బొట్టుబిళ్ల సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. వీరిని ఆలయ సమితి సభ్యులు సన్మానించారు. ఆలయ సమితి సభ్యుడు మేసినేని వెంకట్‌రావు, అర్చకుడు నగేశ్, జుట్టు అభిషేక్, సుధీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

నిర్మల్ రూరల్: మెదక్ జిల్లా చేగుంటలో సీఆర్పీలుగా పని చేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రమేశ్, శ్రీనివాస్ కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాదిగ అంబేడ్కర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బర్ల సాయినాథ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. సీఆర్పీలు చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని, వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


అడెల్లిలో భక్తుల సందడి



ఆలయం వద్ద భక్తుల రద్దీ

సారంగాపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచే కాకుండా నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈవో రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

స్పందించి బాగు చేయించారు



మొక్కలు తొలగించిన తర్వాత రోడ్డు

లక్ష్మణచాంద: మండల కేంద్రం నుంచి మల్లాపూర్ వెళ్లే రోడ్డు మార్గంలో మూలమలుపు వద్ద చెట్ల పొదలు పెరిగి ముందు నుంచి వస్తున్న వాహనాలు కనిపించడంలేదు. ప్రమాదకరంగా మారిన చెట్ల పొదలను ఆదివారం మండల కేంద్రానికి వచ్చిన సోన్ సీఐ నవీన్‌కుమార్ చూసి వెంటనే స్పందించారు. లక్ష్మణచాంద వీడీసీ సభ్యులను పిలిచి జేసీబీ సాయంతో మూలమలుపు వద్ద పెరిగిన చెట్లను తొలగింపజేశారు. దీంతో రోడ్డు బాగు కావడంతో మండల వాసులు హర్షం వ్యక్తంజేస్తున్నారు.

ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని కొలాంగూడ పంచాయతీ పరిధి దేవునిగూడెం గ్రామంలో ఆదివారం పార్వతీఫణీంద్రాలస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పండితుడు విష్ణుంబొట్ల రాజశేఖరశర్మ తదితరులున్నారు.

ఐసీసీ.. అమలేది?



- మహిళలపై తరచూ వేధింపులు
- యువతులు, ఉద్యోగినులపైనా..
- కుమిలిపోతున్న బాధిత స్త్రీలు
- కనిపించని ఫిర్యాదు కమిటీలు
- సంబంధిత అధికారుల పట్టింపేది?

నిర్మల్: 'తన ఫ్రెండ్స్‌తో పాటు సార్లందరూ బాగానే ఉన్నారు. కానీ..ఆ ఒక్క సార్ మాత్రమే మరోలా ఉన్నాడు. అందరి దృష్టిలో మంచోడనే పేరుంది. తనతో ఆ సార్ మాట్లాడే మాటతీరు, అతడి ప్రవర్తన ఏమాత్రం బాగాలేదు. వ్యంగ్యంగా, కాస్త అసభ్యకరమైన రీతిలో మాట్లాడటం చేస్తున్నాడు. ఆమెలో తెలియని భయం. ఇదంతా ఇంట్లో వాళ్లకో.. స్నేహితులకో.. చెప్పడానికి ధైర్యం చాలడం లేదు. ఎక్కడ తనది.. తన కుటుంబానిది పరువు పోతుందోనన్న భయం. మరోవైపు ఎదిరించినా.. లేదా ఇలాగే మౌనంగా ఉన్నా ఇంకేం చేస్తాడోనన్న భయాందోళన.. వీటిమధ్య తనలో తానే కుమిలిపోతోంది.'

ఇలా.. ఒక్క ఈ విద్యార్థినికే కాదు.. రోజూ ఆటోలో ఉద్యోగానికి వెళ్తున్న ఓ ఉద్యోగిని ఆ ఆటోడ్రైవర్ వేధింపులను తట్టుకోలేక ఇబ్బంది పడుతోంది. ఓ పెద్ద దుకాణంలో పనిచేస్తున్న మరో యువతి సదరు యజమాని నుంచి వేధింపులు ఎదుర్కొంటోంది. ఏకంగా ప్రభుత్వ కార్యాలయాల్లోనే వేధింపులకు గురవుతున్న ఉద్యోగినులూ ఉన్నారు. అడుగడుగునా అతివలకు అసభ్యకరమైన వేధింపులు, వ్యంగ్యమైన మాటలు, మింగేలా చూసే చూపులు తప్పడం లేదు. కానీ.. వారంతా తమలో తామే కుమిలి పోతున్నారు. ఇలాంటి వారి నుంచి కనీసం ఫిర్యాదు తీసుకోవడానికి జిల్లాలో 'ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ' (ఐసీసీ)లను ఏర్పాటు చేయలేదు. మహిళలు పనిచేసేచోట ఉండాల్సిన 'అంతర్గత ఫిర్యాదుల కమిటీ'ల జాడ లేదు. జిల్లాలో వరుసగా ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నా.. అధికారుల పట్టింపు లేదన్న ఆరోపణలున్నాయి.

వేధించని చోటెక్కడా..?

అక్కడా, ఇక్కడా అని కాదు.. మహిళలపై ప్రతిచోటా లైంగిక వేధింపులు పెరుగుతుండటం ఆందోళనకరం. ప్రధానంగా జిల్లాలో ఇటీవలి కాలంలో ఇలాంటి వేధింపులు వేగంగా పెరుగుతున్నాయి. కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండాలన్న ఉద్దేశంతో వివిధ దుకాణాలు, హోటళ్లు, ప్రైవేట్ కార్యాలయాల్లో యువతులు, మహిళలు పనిచేస్తున్నారు. ఇలాంటి చోట్ల చాలామంది వివిధ రకాల వేధింపులకు గురవుతున్నారు. వారి పేదరికాన్ని ఆసరాగా చేసుకుని డబ్బు ఆశ చూపుతూ లొంగదీసుకుంటున్న ఘటనలూ ఉన్నాయి. బయటకు వచ్చి చెప్పుకొంటే.. పరువుతో పాటు ఉన్న ఉపాధి పోతుందన్న భయం బాధితుల నోరు తెరువనివ్వడం లేదు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు, కెరీర్ గైడెన్స్ ఇవ్వాల్సిన అధ్యాపకులూ తమ స్టూడెంట్లపై కన్నేయడం, వేధించడం దారుణం.

తానే ట్రాన్స్‌ఫర్ చేయించుకుని..

ఓ శాఖకు చెందిన ఉద్యోగిని ఓ అధికారి నుంచి వేధింపులను ఎదుర్కొన్నారు. సంబంధిత శాఖ పనిపైన కాకుండా పర్సనల్ విషయాలను మాట్లాడటం, చొరవ తీసుకోవడం చేశాడు. అవసరం లేకున్నా ఫోన్లు, మెసేజ్‌లు చేయడం కొనసాగించాడు. ఎంత చెప్పినా సదరు సారులో మార్పు రాకపోవడంతో బాధిత ఉద్యోగినే ట్రాన్స్‌ఫర్ చేసుకుని వెళ్లిపోయారు. గతంలోనూ ఓ స్థాయి అధికారి ఇదే తీరుగా తన కింది ఉద్యోగినితో ప్రవర్తించిన తీరు విచారణ వరకూ వెళ్లింది.

చట్టం ఉన్నా..

మహిళలు పనిచేసే చోటే ఎక్కువగా లైంగిక వేధింపుల బారిన పడుతున్నారు. భారత రాజ్యాంగంలోని 14, 15 ఆర్టికల్స్ ప్రకారం లైంగిక వేధింపులు అనేవి స్త్రీ ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేవి. ఈనేపథ్యంలోనే 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధం, నిషేధ చట్టం –2013' అమలులోకి తీసుకువచ్చారు.

- లైంగిక వేధింపులను నిరోధించడానికి సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను ఈ చట్టం పాటిస్తుంది.
- ఈ చట్టం ప్రకారం మహిళలు పనిచేసే చోట వారికి ఎదురయ్యే వేధింపులు, సమస్యలపై విచారించేందుకు 'అంతర్గత ఫిర్యాదుల కమిటీ'ని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.
- ఇందులో వచ్చిన ఫిర్యాదులను 90రోజుల వ్యవధిలో కమిటీ విచారణ పూర్తిచేయాలి.
- చట్టం ప్రకారం ఈ విచారణ గోప్యంగా ఉంచాలి.
- ఒకవేళ ఎవరైనా బహిర్గత పరిస్తే అందుకు తగిన జరిమానా ఉంటుంది.
- విచారణ తర్వాత నివేదికను జిల్లా అధికారి (కలెక్టర్/స్త్రీ శిశు సంక్షేమశాఖాధికారి)కి పంపించాలి.
- వారు 60రోజుల్లోపు దానిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.
- జిల్లా అధికారి తమ జిల్లాలో ఈ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.
- బాధిత మహిళలు ఉచితంగా న్యాయసహాయం పొందడానికి సఖీ కేంద్రాలు సహకరించాలి.
- మహిళలతో పాటు 18ఏళ్లలోపు బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు 'కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ మల్టీ డిసిప్లినరీ టీమ్' ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.
- కమిటీలు తరచూ సమావేశాలు ఏర్పాటు చేస్తూ.. చట్టాలపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

కానీ.. జిల్లాలో చట్టాలపై అవగాహన కల్పించిన దాఖలాలు లేవు. అప్పుడప్పుడు షీటీమ్‌లు విద్యాసంస్థల్లో అవగాహన కల్పిస్తున్నాయి. కానీ.. జిల్లాలో మహిళలు అధికసంఖ్యలో పనిచేసే చోట అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ)లను ఏర్పాటు చేయడం లేదు. ప్రభుత్వ శాఖలు, కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, దుకాణాలు, ఇతర పనిప్రదేశాల్లో మహిళల కోసం ఇప్పటివరకు ఇలాంటి కమిటీలు వేయకపోవడంపై విమర్శలున్నాయి.

కాంగ్రెస్‌తోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం



భైంసాలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

- ఏడాదిలోనే 53వేల ఉద్యోగాలిచ్చాం
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

భైంసాటౌన్: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో లక్ష మంది నిరుద్యోగులకు కూడా ఉద్యోగావకాశాలు కల్పించలేదని, కాంగ్రెస్‌తోనే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం పట్టణంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. కాంగ్రెస్ ఏడాది పాలనలోనే 53వేల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ ప్రమోషన్లు, బదిలీల సమస్య పరిష్కరించామని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వీ నరేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బూత్‌లవారీగా ఓటర్లను కలిసి కాంగ్రెస్ విజయానికి పనిచేయాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి వీ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే ప్రైవేట్ టీచర్లందరికీ రూ.3లక్షల బీమా సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. గ్రంథాలయాలు ఏర్పాటు చేయడంతోపాటు వాటి ఆధునికీకరణకు కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గంలో ఐటీఐ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యేలు వేణుగోపాలాచారి, విఠల్‌రెడ్డి, నారాయణ్‌రావు పటేల్, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, సుగుణ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్

నిర్మల్‌రూరల్: నిరుద్యోగులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. మండలంలోని కొండాపూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే ప్రభుత్వానికే దక్కిందని చెప్పారు. పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మతతత్వ బీజేపీ ఉచ్చులో పడి నిరుద్యోగులు మోసపోవద్దని సూచించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సొంత నిధులతో రూ.3లక్షల బీమా సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీగా కొనసాగినంత కాలం తానే ప్రీమియం చెల్లిస్తానని చెప్పారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్లు, అధ్యాపకులకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి హెల్త్‌కార్డులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, రాష్ట్ర విత్తన సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, నిర్మల్, సారంగపూర్ ఏఎంసీల చైర్మన్లు భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాతిక్, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పల గణేశ్, నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సుగుణ, రాజేశ్వర్, నాందేడపు చిన్ను తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మహిళా రైతులు

దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామ మహిళా రైతులు మంత్రి సీతక్కను కలిశారు. ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యవహారంలో తమపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ విషయమై ఎస్పీ జానకీ షర్మిలను ఇటీవల కలిస్తే దురుసుగా వ్యవహరించారని సీతక్కకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయకుంటే ఎమ్మెల్సీ ఎలక్షన్లను బహిష్కరిస్తామని హెచ్చరించారు. దీంతో వేణుగోపాలాచారి, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి కలుగజేసుకుని వారికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు

- రూ.77.70 లక్షలు మంజూరు
- అప్‌గ్రేడ్ కానున్న 10 కేంద్రాలు
- 50 సెంటర్లలో తాగునీటి వసతి
- 170 మరుగుదొడ్ల నిర్మాణాలు




మోడల్ కేంద్రంగా ఎంపికైన సోన్–3 కేంద్రం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. 10 అంగన్‌వాడీ కేంద్రాలు, 50 సెంటర్లలో తాగునీటి వసతి కల్పించనున్నారు. 170 కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇందుకు జిల్లా శిశు సంక్షేమశాఖ ద్వారా ప్రభుత్వం ఇటీవల రూ.77.70 లక్షలు మంజూరు చేసింది. ఈ పనులను స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌శాఖ ద్వారా చేపట్టనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి వసతి లేకపోవడంతో విద్యార్థులతోపాటు టీచర్లు, ఆయాలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కరించేందుకు జిల్లాలోని 50 అంగన్‌వాడీ సెంటర్లలో తాగునీటి వసతి కల్పించనున్నారు. గతంలో కేంద్రాలకు మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణం చేపట్టినప్పటికీ నీరు రాని పరిస్థితి నెలకొంది. దీంతో ఒక్కో సెంటర్‌కు రూ.17వేల చొప్పున 50 సెంటర్లకు తాగునీటి వసతి కల్పించడానికి రూ.8.50 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. ప్రభుత్వ, ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సరైన మరుగుదొడ్లు లేవు. టీచర్లు, ఆయాలు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయంపై దృష్టి సారించిన ప్రభుత్వం 170 టాయిలెట్స్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. ఒక్కోదానికి రూ.36వేలు కేటాయిస్తూ రూ.62.20 లక్షలు మంజూరు చేసింది. ఈ పనులు త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు.

10 మోడల్ కేంద్రాలకు..

జిల్లాలోని అష్ట–1, బాసర–3, కుంసర, మాలేగం–1, సారంగపూర్–1, సోన్–3, న్యూ పోచంపాడు, లింగాపూర్, పెంబి–1, చింతల్‌పేట్ అంగన్‌డీ కేంద్రాలను మోడల్‌గా తీర్చిదిద్దనున్నారు. ఈ మేరకు ఒక్కో కేంద్రానికి రూ.2లక్షల చొప్పున కేటాయించారు. ఈ 10 కేంద్రాలకు గతంలోనే మొదటి విడతగా ఒక్కోదానికి రూ.1.20 లక్షలు కేటాయించగా, రెండో విడత రూ.80వేలు మంజూరయ్యాయి.

తెరపాఠం.. పరిపుష్టం



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో, అధికారులు (ఫైల్)

- హైస్కూళ్లలో బోధనకు ఐఎఫ్‌పీలు
- ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ
- అర్థవంత అభ్యసనకు తోడ్పాటు

నిర్మల్‌ఖిల్లా: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వరంగ పాఠశాల విద్యకు పెద్దపీట వేస్తున్నాయి. ఈ క్రమంలోనే కొన్నేళ్లుగా పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూరుతున్నాయి. పాఠ్యాంశాల బోధనలో అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మన ఊరు–మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల, పీఎంశ్రీ లాంటి పథకాల అమలులో భాగంగా వివిధ రకాల సౌకర్యాలు కల్పించబడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే జిల్లాలోనూ అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ తరగతులు అందుబాటులోకి తేవడంలో భాగంగా ప్రతీ బడికి మూడు చొప్పున అత్యంత విలువైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) టీవీలను 2023–24 విద్యాసంవత్సరం నుంచి విడతలవారీగా పంపిణీ చేస్తున్నారు. 8, 9, 10 తరగతుల్లో విద్యార్థులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో నాణ్యమైన రీతిలో పాఠ్యాంశాలు బోధించేందుకు వీటిని వినియోగిస్తున్నారు. తాజాగా వీటిని వినియోగించుకునేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు. మరోవైపు కొన్ని పాఠశాలల్లో ఐఎఫ్‌పీలను పూర్తిస్థాయిలో వాడుకోలేకపోతున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా గుర్తించి ఇటీవల ప్రత్యేక కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ఆమె అన్ని పాఠశాలల్లోని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డుల ద్వారానే ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలంటూ ఆదేశాలు జారీ చేశారు.

వినియోగంపై శిక్షణ

రెండేళ్లుగా ఆయా పాఠశాలల్లో తెరపాఠాలు మొదలయ్యాయి. కొన్నిచోట్ల వీటి వినియోగంలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు అన్ని పాఠశాలలకు ఇంటర్నెట్ వసతి లేకపోవడం కూడా అంతరాయానికి కారణమవుతోంది. ఉపాధ్యాయులందరికీ వీటి వినియోగంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో తాజాగా సబ్జెక్టుల వారీగా రెండు రోజులపాటు జిల్లా వ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సబ్జెక్టులవారీగా శిక్షణ పూర్తి

పాఠ్యాంశాల బోధనలో విద్యార్థికి ఉపన్యాస పద్ధతిలో బోధించే కంటే ఫొటోలు, వీడియోలను ప్రదర్శిస్తూ బోధించడం ద్వారా సమగ్ర అవగాహన కలగడమే కాకుండా పూర్తిస్థాయిలో మనసులో ముద్రించబడుతుంది. తద్వారా నేర్చుకోవాల్సిన పాఠ్యాంశం కూడా సులువుగా అర్థమవుతుంది. ఈ నేపథ్యంలోనే జిల్లా, కాంప్లెక్స్ స్థాయి శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రాలతోపాటు తెలుగు, ఇంగ్లిష్, హిందీ ఉపాధ్యాయులకు కూడా వీటి వినియోగంపై శిక్షణ ఇచ్చారు. భాషా సంబంధిత అంశాలు, సబ్జెక్టులన్నీ వీటి ద్వారానే బోధించాలని జిల్లా విద్యాశాఖాధికారులు సూచిస్తున్నారు. రానున్న రోజుల్లో బ్లాక్ బోర్డుల స్థానంలో ఐఎఫ్‌పీ ప్యానెల్ బోర్డులే వినియోగించేలా చర్యలు చేపడుతున్నారు. సమగ్ర శిక్షా ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ వినియోగంపై ప్రతీ సబ్జెక్టులో మండలానికి ఇద్దరు ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చారు. వీరు కాంప్లెక్స్ స్థాయిలో ఈ నెల 11, 12 తేదీల్లో సబ్జెక్టుల వారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధనలో మార్పులు సహజమే. ప్రస్తుతం తరగతి గదుల్లో అత్యాధునిక ఐఎఫ్‌పీ ప్యానెల్ బోర్డులు అందుబాటులోకి వచ్చాయి. వీటిని ప్రతీ ఉపాధ్యాయుడు వినియోగిస్తూ అర్థవంతమైన రీతిలో బోధన అభ్యసన ప్రక్రియను చేపట్టాలి. ఉపాధ్యాయుడు కూడా నూతన సాంకేతికతను వినియోగిస్తూ బోధిస్తే అభ్యసన ప్రక్రియ సులభమవుతుంది.

– పీ రామారావు
జిల్లా విద్యాశాఖాధికారి

ఘనంగా సేవాలాల్ జయంతి



కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ అధికారులు



నృత్యం చేస్తున్న బంజారా విద్యార్థినులు

బాసర: బాసర ఆర్జీయూకేటీలో ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, ఏవో రణధీర్ సాగి, పూజారి సంతోష్ మహరాజ్ పాల్గొన్నారు. సంత్ సేవాలాల్ జీవితం ఆచరణీయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బంజారా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్ డాక్టర్ అజయ్ రేవల్లి, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ విజయ్‌కుమార్, శ్యాంబాబు, మోతీలాల్, బలరాంనాయక్, తులసీరామ్, శంకర్‌నాయక్, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రజాప్రతినిధులు



అమ్మవారిని దర్శించుకుంటున్న అశోక్‌రావు చవాన్



అమ్మవారిని దర్శించుకుంటున్న మహేశ్వర్‌రెడ్డి

బాసర: నిర్మల్ జిల్లా బాసరలో శ్రీసంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎంపీ గోడం నగేశ్, ముధోల్, నిర్మల్ ఎమ్మెల్యేలు రామారావు పటేల్, మహేశ్వర్ రెడ్డి, మహారాష్ట్ర మాజీ సీఎం, రాజ్యసభ సభ్యుడు అశోక్‌రావు చవాన్, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అంతకుముందు శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. వీరి వెంట మాజీ సర్పంచ్ సతీశ్వర్‌రావు, బీజేపీ మండలాధ్యక్షుడు పుట్నాల సాయినాథ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా కేజీబీవీ



తల్లిదండ్రులతో విద్యార్థులు

దస్తురాబాద్: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ కళాశాలలో ఆదివారం విద్యార్థులను చూడటానికి అనుమతివ్వటంతో తల్లిదండ్రులు అధికసంఖ్యలో వచ్చారు. ముందుగా పిల్లల యోగక్షేమాలు తెలుసుకున్నారు. వెంట తెచ్చిన ఆహారాన్ని వారికి తినిపించారు. దీంతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. రానున్న వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు తల్లిదండ్రులు సూచించారు.

క్లుప్తంగా

సిమెంట్ ఇటుకతో కొట్టి..

- భార్యను హత్య చేసిన భర్త
- లక్సెట్టిపేటలో ఘటన



రాజకుమారి (ఫైల్)

లక్సెట్టిపేట: సిమెంట్ ఇటుకతో కొట్టి భార్యను హత్య చేసిన ఘటన మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. గోదావరి రోడ్డు వికార్స్ కాలనీకి చెందిన లాకవత్ రాజకుమారి (40), గణేశ్ భార్యభర్తలు. భర్త తాగుడుకు బానిసై ఎలాంటి పనులు చేయకుండా తిరుగుతూ ఉండేవాడు. నిత్యం మద్యం తాగి వచ్చి భార్యకు వివాహేతర సంబంధం ఉందని అనుమానంతో వేధించసాగాడు. ఆదివారం ఉదయం రాజకుమారి బాత్రూమ్‌కు వెళ్లగా, వెనుకాల వెళ్లి సిమెంట్ ఇటుకతో ఆమె తలపై కొట్టడంతో తీవ్రరక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తల్లి రేణుకబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కారు బోల్తా: ఒకరి మృతి



బోల్తాపడ్డ కారు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమరవాది హైవేపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లికి చెందిన సింగరేణి ఉద్యోగి పూదరి ఓంకార్(32) మరో ఇద్దరు రాము, సంజయ్‌లు కారులో మందమర్రి వైపు వస్తున్నారు. అమరవాది హైవేపై కారు అదుపు తప్పి హైవే రైలింగ్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో ఓంకార్ అక్కడికక్కడే మృతిచెందగా రాము, సంజయ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బట్వాన్‌పల్లిలో ఇడిగిరాల భీమయ్యకు చెందిన పెంకుటిల్లు ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. రెండు తులాల బంగారం, రూ.80 వేల నగదుతోపాటు భీమయ్య కుమారుడు మహేశ్‌కు సంబంధించిన విద్యా అర్హత ధ్రువీకరణపత్రాలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న బెల్లంపల్లి అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కూలీ పనిచేసుకునే తనకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధితుడు భీమయ్య కోరాడు.



జాతరలో ఆదివాసీల నృత్యం



మొక్కులు చెల్లించేందుకు బారులు తీరిన భక్తులు



మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ముగిసిన మైసమ్మ జాతర

- చివరిరోజు జనసంద్రంగా గాంధారి ఖిల్లా
- తరలివచ్చిన ఆదివాసీలు
- దర్బార్‌లో పాల్గొన్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



మైసమ్మకు పూలదండతో అలంకరణ



భైరవుడి విగ్రహం వద్ద మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే వివేక్

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట గాంధారీ ఖిల్లా వద్ద మూడురోజులుగా నిర్వహిస్తున్న మైసమ్మ జాతర ఆదివారం ముగిసింది. ఆదివాసీ నాయక్‌పోడ్‌లు అధికసంఖ్యలో తరలివచ్చి మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివాసీలు సంప్రదాయ తప్పెటగూళ్ల ఆటలు, డప్పుచప్పుళ్లతో చేరుకుని అక్కడ గిరిజనులు తీసుకువచ్చిన గంగాజలంతో దేవతామూర్తులను శుద్ధి చేసి పట్నాలు వేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కోళ్లు, మేకలు బలిచ్చారు. ఆదివాసీలు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. జిల్లాతోపాటు పక్క జిల్లాల నుంచి ఆదివాసీలు, భక్తులు తరలిరావడంతో గాంధారీ ఖిల్లా ప్రాంతమంతా జనసంద్రంగా మారింది.

ఆదివాసీలకు ప్రత్యేక భవనం: ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

ఆదివాసీల కోసం ప్రత్యేక భవనం నిర్మించేందుకు కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం నిర్వహించిన దర్బార్‌కు ఆయన హాజరై మాట్లాడారు. భవనం ఏర్పాటుకు రెండు మూడు స్థలాలను పరిశీలించాలని నాయక్‌పోడ్ సంఘ నాయకులకు సూచించారు. భవనం కోసం స్థలంతోపాటు రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తానన్నారు. గాంధారి ఖిల్లాను మరింతగా అభివృద్ధి చేయాలంటే అటవీశాఖ అనుమతులు తప్పనిసరని పేర్కొన్నారు. ఆదివాసీల హక్కుల కోసం సంఘం నాయకులంతా ఓ కమిటీగా ఏర్పడి వస్తే సీఎంను కలిసి తద్వారా ఆదివాసీల సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో వందలాది కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో జాతర వేదిక వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంప్రదాయ నృత్యాలు, తప్పెటగూళ్ల ఆటలు, లక్ష్మీదేవర నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. క్యాతనపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, నాయక్‌పోడ్ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సేవాలాల్



హాజరైన మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

- రాష్ట్ర మంత్రి సీతక్క



పాల్గొన్న బంజారా సేవాలాల్ భక్తులు

బాసర: సంత్ సేవాలాల్ మహరాజ్ ఆదర్శప్రాయుడని, ఆయన అడుగుజాడల్లో నడవాలని రాష్ట్రమంత్రి సీతక్క పేర్కొన్నారు. బాసరలోని గోదావరి నది ఒడ్డున శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం 286వ సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి పొరగాడ్ పీఠాధిపతి బాబుసింగ్ మహరాజ్, దీక్షగురు ప్రేమ్‌సింగ్ మహరాజ్, ఎంపీ నగేశ్, ముథోల్, నిర్మల్, ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు రామారావు పటేల్, మహేశ్వర్‌రెడ్డి, వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, బంజారా నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బాసరలో సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని తెలిపారు. లంబడా, బంజారా నాయకుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం తరఫున సేవాలాల్ సంస్థాన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. బంజారాల కోసం బాసరలో ఐదెకరాల భూమి కేటాయించే వరకు పోరాడతానని ఎమ్మెల్యే రామారావుపటేల్ తెలిపారు. బాసరలో సేవాలాల్ మహరాజ్ మందిరం నిర్మిస్తామన్నారు. 15 వేల మందికి అన్నదానం చేసిన ఎమ్మెల్యేకు సేవాలాల్ సంస్థాన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ హిందూధర్మం గొప్పతనాన్ని బంజారాలకు తెలియజేసిన మహోన్నత వ్యక్తి సేవాలాల్ అని కొనియాడారు. అనంతరం బంజారా నాట్యమండలి, పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బాసరలో భక్తుల కిటకిట



క్యూలైన్‌లో భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బాసర: బాసర ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలువులు రావడంతో అధికసంఖ్యలో తరలివచ్చారు. మాఘశుద్ధ సంకట చతుర్థి శుభముహూర్తం సందర్భంగా జిల్లా నుంచే కాక ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి తరలివచ్చి పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. జ్ఞాన సరస్వతీ, మహంకాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. తల్లిదండ్రులు చిన్నారులకు అర్చకులతో అక్షర శ్రీకారం పూజలు చేయించారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పడుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ

- ఒకరు మృతి



చుక్కయ్య (ఫైల్)

రెబ్బెన: రాంగ్‌రూట్‌లో వచ్చి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టిన ఘటన మండలంలోని నవేగాం బస్టాండ్ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై డి.చంద్రశేఖర్ కథ నం ప్రకారం.. మండలంలోని గంగాపూర్‌కు చెంది న నగోషా చుక్కయ్య (37), భార్య మాధవితో కలి సి ఆదివారం బైక్‌పై కాగజ్‌నగర్‌లోని బంధువుల ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలోని నవేగాం బస్టాండ్ దాటగా రాళ్లపేటకు చెందిన కుక్కల ల క్ష్మణ్ ఎదురుగా రాంగ్‌రూట్‌లో బైక్ నడుపుకుంటూ వచ్చి చుక్కయ్య బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చుక్కయ్యకు తీవ్రంగా, మాధవి గాయాలయ్యా యి. చుక్కయ్యకు రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరుకోగా వీరి బంధువు శ్రీకాంత్ వెంటనే 108కు సమాచారం అందించాడు. సిబ్బంది అక్కడికి చేరుకుని ఇద్దరిని కాగజ్‌నగర్‌కు తరలించారు. చుక్కయ్యను వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య ఫిర్యాదుతో లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరి మృతి

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ సమీపంలో జాతీయ రహదారి 44పై బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందాడు. ఎస్సై కె.మహేందర్, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా కలాంబి గ్రామానికి చెందిన నివారే జ్ఞానేశ్వర్ (56) గత కొంతకాలంగా బోథ్‌లోని ఓ ప్రైవేటు జిన్నింగ్ మిల్లులో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆదివారం తన స్వగ్రామమైన కలాంబి గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. శర్మదాబా సమీపంలో వెనక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం అతివేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై సుమలత తెలిపారు.



మల్లేశ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఆమె కథనం ప్రకారం.. మండలంలోని మల్లాపూర్‌కు చెందిన రేణి మల్లేశ్ (56) శనివారం రాత్రి పని నిమిత్తం బైక్‌పై లక్ష్మణచాందకు వెళ్లి తిరుగుపయనమయ్యాడు. ఈక్రమంలో గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశ్ రోడ్డు పక్కనే ఉన్న పంట పొలంలో పడి మృతిచెందాడు. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సుమలత ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఉరేసుకుని టీచర్ ఆత్మహత్య



సంతోష్ నాయక్ (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన టీచర్ సంతోష్‌నాయక్ (28) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. సంతోష్‌నాయక్ జైనూర్ మండలం జామ్నిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు పని నిమిత్తం నిర్మల్‌కు వెళ్లారు. ఇంట్లో ఆయన సోదరి ఉన్నారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో సోదరి ఆయన్ను నిద్ర నుంచి లేపే ప్రయత్నం చేయగా మేల్కొలేదు. దీంతో ఆమె వెంటనే ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు చెప్పింది. వారు మధ్యాహ్నం వచ్చి చూసేసరికి ఉరేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బేల: మండలంలోని కాంఘర్‌పూర్ రెవెన్యూ గ్రామశివారులోని పెనగంగ నుంచి ఆదివారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ తెలిపారు. సమాచారం మేరకు పెన్‌గంగ శివారులో ఏఎస్సైలు లింగన్న, జీవన్‌కుమార్ తనిఖీలు నిర్వహిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

పిచ్చికుక్కదాడిలో ఒకరికి గాయాలు

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఆరేవాడలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మానేపల్లి సత్యనారాయణ..విందు కార్యక్రమానికి వెళ్లి తిరిగివస్తుండగా పిచ్చికుక్క దాడిలో కుడి కాలికి గాయమైంది. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నాడు.



పెయింటెడ్ స్టార్క్స్ పక్షులు



బాతుజాతి పక్షులు


అరుదైన పక్షులకు ఆలవాలం

కాగజ్‌నగర్ డివిజనల్ అరుదైన పక్షులకు ఆలవాలంగా మారింది. ఇక్కడ ఎన్నో జాతులు మనుగడ సాగిస్తున్నాయి. గతనెలలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఇక్కడ బర్డ్‌వాక్ ఫెస్టివల్ విజయవంతంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన పక్షి ప్రేమికులు సిర్పూర్(టి), బెజ్జూర్, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్ రేంజ్‌ల్లో పర్యటించారు. అటవీప్రాంతంలో స్వేచ్ఛగా సంచరిస్తున్న అందమైన పక్షులను గుర్తించి తమ కెమెరాల్లో బంధించారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో 240 వరకు పక్షి జాతులు ఉన్నాయని సిర్పూర్(టి) రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు.

– సిర్పూర్(టి)



అరుదైన పక్షి



కాగజ్‌నగర్ డివిజన్‌లో అరుదైన పక్షులు



స్మాల్ ఇండియన్ ప్యాంటికోల్స్



బ్రాహ్మిణి డక్స్



బార్‌హెడెడ్ గూస్ పక్షులు

బెల్లంపల్లి డివిజన్‌లోనే బెబ్బులి

- తాండూర్–బెల్లంపల్లి మధ్య సంచారం
- కదలికలను పర్యవేక్షిస్తున్న అటవీ అధికారులు
- ఆందోళన చెందుతున్న గ్రామీణ ప్రజలు



అచ్చులాపూర్ అటవీ ప్రాంతంలో గుర్తించిన పులి పాదముద్రలు

బెల్లంపల్లి: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి బెల్లంపల్లి డివిజన్‌లోకి వచ్చిన బెబ్బులు.. పక్షం రోజులుగా ఇక్కడే మకాం వేసింది. బెల్లంపల్లి, తాండూర్ మండలాల పరిధిలోనే రోజుకో గ్రామంలో దాని పాదముద్రలు కనిపిస్తున్నాయి. దీంతో ఇటు అటవీ అధికారులకు, అటు అటవీ గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. అటవీ అధికారులు నిత్యం పులి కదలికలను పర్యవేక్షిస్తున్నారు. పులికి ఆపద రాకుండా చూసుకుంటున్నారు. కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి అటవీ ప్రాంతం నుంచి జిల్లాలోకి వచ్చిన పులి బెల్లంపల్లి మండలం కన్నాల అటవీ ప్రాంతం, కాసిపేట మండలంలోని అటవీ ప్రాంతాల్లో సంచరిస్తోంది. ఓ అడవి పందిపైదాడి చేసింది. తర్వాత తాండూర్ మండలం అంకుశం, మాదారం, రేపల్లెవాడ అటవీ ప్రాంతాల మీదుగా రెబ్బెన మండలం పులిమడుగు అటవీ ప్రాంతాల్లో సంచరించింది. తర్వాత తక్కళ్లపల్లి గ్రామశివారు అటవీ ప్రాంతం నుంచి తాండూర్ మండలం గోపాల్‌నగర్ శివారులో ప్రత్యక్షమైంది. అక్కడ ఉన్న ఓ మంచినీళ్ల బావివద్ద గ్రామీణులు పులి అడుగులను చూసి ఆందోళన చెందారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించడంతో తక్షణమే స్పందించిన వారు సంరక్షణ చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం పులి పాదముద్రలను అచ్చులాపూర్ గ్రామం ప్రజలకు కనిపించాయి. గ్రామం నుంచి సమీపంలో ఉన్న అడవిలోకి వెళ్లినట్లు అటవీ అధికారులు గుర్తించారు. బెల్లంపల్లి మండలం చర్లపల్లి గ్రామ పరిసరాల్లో పాద ముద్రలు కనిపించాయి. పులి కదలికలను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తున్న అటవీ అధికారులు, సిబ్బంది చర్లపల్లి గ్రామంలో పర్యటించారు. పాదముద్రల ఆధారంగా పులి సంచారాన్ని ధ్రువీకరించారు. అచ్చులాపూర్, గోపాల్‌నగర్, చంద్రవెల్లి, చర్లపల్లి తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాని సూచించారు. ఒంటరిగా అటవీ ప్రాంతానికి వెళ్లొద్దని తెలిపారు. పులికి ఆపద తలపెట్టొద్దని పేర్కొన్నారు.

మూడు దశాబ్దాల తర్వాత..



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 1993–96 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత ఒకచోట కలిసిన వీరు ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కళాశాలలో చదివి ఉన్నత శ్రేణిలో స్థిరపడిన బోయ తిరుపతి (జిల్లా జడ్జి), కె.వేణుగోపాలస్వామి (డీఎంఎస్), కరీ ముల్లాఖాన్ (సాఫ్ట్‌వేర్ కంపెనీ డెలివరీ మేనేజర్), శ్రీరామ్ (డెల్ కంపెనీ మేనేజర్)ను సన్మానించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువా కప్పి సత్కరించారు. ఒక్కో బ్రాంచ్ పూర్వవిద్యార్థులు కళాశాల హాస్టల్ ముందు మొక్కను నాటారు. ప్రిన్సిపాల్ దేవేందర్, మైనింగ్, ఈఐ, ఈఈఈ బ్రాంచిల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.